

టార్గెట్ ఎస్పీ

- మేం చెప్పినట్లు పనిచేయడం లేదు
- వైసీపీ నేతలపై కేసులు లేవు
- మంత్రికి ఏకరువు పెట్టిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు

(కడప-ఆంధ్రజ్యోతి): ఎస్పీ హర్షవర్ధన్ రాజును ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలు టార్గెట్ చేశారు. ఆయనపై తమ అసంతృప్తిని మంత్రి సవిత ఎదుట వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన సవిత ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇన్‌చార్జి కలెక్టరు అదితిసింగ్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు కూడా హాజరయ్యారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మాధవి, పుట్టా సుధాకర్‌యాదవ్, వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, బద్వేలు నేత రితీశ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు టీడీపీ నేతలు ఎస్పీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో తమపై అప్పటి డిప్యూటీ సీఎం సోదరుడు సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారని అయితే 41 నోటీసు ఇచ్చి వదిలేశారని, ఆయనపై చర్యలు లేవంటూ ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాస రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. బి.కోడూరు మండలంలో ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారిపై కాకుండా టీడీపీ నేతలపై బలమైన సెక్షన్లు నమోదు చేశారంటూ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితీశ్ కుమార్‌రెడ్డి తెలిపారు. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తుండడంతో వైసీపీకి అనుకూలంగా మారిందని, వైసీపీ హయాంలో టీడీపీ శ్రేణులు చాలా ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడన్నీ నిబంధనల ప్రకారమే చేస్తా మంటున్నారంటూ ఎస్పీపై వారంతా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. మీరే ప్రధాన సమస్య అంటూ మంత్రి సవిత ఎస్పీతో అన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చకు వచ్చాయి. బద్వేలు నియోజకవర్గంలోని కాశినాయన క్షేత్రానికి అటవీ శాఖ నుంచి ఇబ్బందులు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని రితీశ్‌కుమార్ రెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. బద్వేలులో జరిగిన భూకబ్జాలు, సొసైటీ బ్యాంకులో జరిగిన అక్రమాల గుట్టురట్టు చేయాలని కోరారు. టీడీపీ శ్రేణులకు నీరు-చెట్టు పెండింగు బిల్లులు ఇవ్వకుండా వైసీపీ నేతలకు బిల్లులు ఇస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, జనసేన అధ్యక్షుడు సుంకర శ్రీనివాసులు మంత్రి సవితతో సమావేశమయ్యారు. మూడు పార్టీల మధ్య సమన్వయం ఉండాలని, ఎవరు ఇబ్బంది పడకుండా ఉండాలని సూచించారు.

వైసీపీ అక్రమాలపై విచారణ చేయిస్తాం



డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి సవిత, చిత్రంలో ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

- జగనన్న ఇళ్ల నిర్మాణంలో అక్రమాల గుట్టు రట్టు చేస్తాం
- ప్రభుత్వ భూములు, వాగుల ఆక్రమణలపై ప్రత్యేక బృందాలతో సర్వే
- కడప జిల్లాలో అధికారులకు ప్రత్యేక రాజ్యాంగం ఉందా?
- ప్రోటోకాల్ ఎందుకు పాటించరు?
- ఇష్టమైతే పనిచేయండి, లేకపోతే వెళ్లిపోండి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత
- గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చాలన్న ప్రజాప్రతినిధులు
- జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో డిమాండ్

కడప, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): "వైసీపీ ఐదేళ్లపాలనలో అంతా దోపిడీ జరిగింది. ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు ఆక్రమించారు. అధికారులపై గన్‌లు పెట్టి బెదిరించి పనులు, అక్రమాలు చేయించుకున్నారు. ఇక జగనన్న ఇళ్ల పేరిట భారీ దోపిడీ సాగింది. ఫ్రీహోల్డ్ భూముల్లో గోల్‌మాల్ సాగింది. వీటన్నింటిపై విచారణ జరిపించి బాధ్యులు ఎంతటివారైనా వదిలే ప్రసక్తి లేదు" అని రాష్ట్ర వెనుకబడిన తరగతులు, బలహీన వర్గాల సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితిసింగ్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను ప్రక్షాళన చేస్తున్నారన్నారు. ప్రజలకు జవాబుదారితనంతో సుపరిపాలన అందిస్తూ స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తున్నారన్నారు. కడపజిల్లా రూపురేఖలు మార్చాలన్నది సీఎం ఉద్దేశ్యమని, ప్రభుత్వ ఆశయసాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్లను నిర్లక్ష్యం చేశారన్నారు. సీఎం సొంత జిల్లాలో కూడా రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. 2014-19 సంవత్సరంలో వేసిన రోడ్లే ఉన్నాయన్నారు. అందుకే దెబ్బతిన్న రోడ్లను సంక్రాంతి లోపు రూ.850 కోట్లతో మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అజెండాలో రూపొందించిన అంశాలపై చర్చ జరిగింది. జిల్లాలో శాఖల వారీగా చేపట్టిన పనుల వివరాలను ఇన్‌చార్జి కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

ఒకే ఇంట్లో వాళ్లకు 200 ఎకరాలు..

జగన్ హయాంలో పులివెందుల నియోజకవర్గంలో సుమారు 200 ఎకరాల భూములను వైఎస్ మనోహర్‌రెడ్డి ఇంట్లో పనిచేసే వారి పేరిట అసైన్‌మెంట్ కమిటీలో అప్పగించారని ఎమ్మెల్సీ అన్నారు. చక్రాయపేటలో ఎమ్మార్వో, వీఆర్వో కుళాయప్పతో భూ దందా సాగుతోందన్నారు. జిల్లాలో ఫ్రీహోల్డ్ భూములపై సర్వే పూర్తయిందని, 9004 ఎకరాల్లో నిబంధనల ప్రకారం వ్యవహరించలేదని విచారణలో తెలిసిందని ఇన్‌చార్జి కలెక్టర్ తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా మైదుకూరు మండలంలో సర్వే చేశామని, అక్కడ బాధ్యులైన తహశీల్దారు, వీఆర్వోలకు నోటీసులు ఇచ్చామని వెల్లడించారు. భూ ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని సర్వేచేసి అనర్హులకు ఇచ్చి ఉంటే వారిని తొలగించి, వాటిని బ్లాక్ చేయాలని మంత్రి ఆదేశించారు. భూములు రీసర్వే చేసిన గ్రామాల్లో 1బీ, అడంగల్ రావడలేదు, దీంతో రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకోవాలన్నా, ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నారంటూ ఎమ్మెల్సీ తెలిపారు.

కడపలో ఆక్రమణలపై చర్యలేవీ: ఆర్.మాధవి



కడపలో వాగులు, వంకలు, రహదారులను ఆక్రమించేసి లేఅవుట్లు వేశారు. వాటిపై ఫిర్యాదు చేశాం. ఎందుకు చర్యలు లేవంటూ ఎమ్మెల్యే ఆర్.మాధవి ప్రశ్నించారు. గౌస్‌నగర్‌లో ఓ కార్పొరేటరు ఎకరా ఆక్రమించారని అన్నారు. భూ ఆక్రమణలపై సర్వే మొదలైంది. ఇప్పటికే పది శాతం పూర్తయింది. రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులతో జాయింట్ కమిటీని ఏర్పాటుచేసుకుని మరో వారం రోజుల్లో వాటికి బౌండరీలు ఏర్పాటు చేస్తామని కడప ఆర్డీవో హామీ ఇచ్చారు. బద్వేలులో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి భూ ఆక్రమణలు వెలికితీయాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. భూకబ్జాలపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అన్యాక్రాంతమైన భూములు తిరిగి స్వాధీనం చేసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఇన్‌చార్జి కలెక్టరును ఆదేశించారు.

మేం రోడ్డు తవ్వామంట : ఆదినారాయణరెడ్డి



వైసీపీ హయాంలో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ఒక్క తట్ట మట్టి వేయలేదు. సంక్రాంతి నాటికి గోతులు పూడ్చేందుకు రూ.850 కోట్లతో పనులు చేపడితే టీడీపీ వాళ్లే గుంతలు తవ్వి పూడుస్తున్నారంటూ మాజీమంత్రి అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మండిపడ్డారు.

తాగునీటి ఎద్దడి

పులివెందుల మున్సిపాలిటీలో వర్షాకాలంలో కూడా నీటిఎద్దడి నెలకొందని డీఎంఎఫ్ నిధులు నుంచి అవసరమైన నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్సీ కోరారు. కడపలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, దాదాపు 15వేల కుటుంబాలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నాయని ఎమ్మెల్యే అన్నారు. జలజీవన్ మిషన్ పథకాన్ని కడపలో కూడా అమలు చేయాలన్నారు. బీసీ బాలికల హాస్టలు నిర్వహణ సరగాలేదని, తక్షణమే ప్రైవేటు భవనంలోకి మార్చాలన్నారు.


ప్రోటోకాల్ ఉల్లంఘనపై మంత్రి ఆగ్రహం

ఇటీవల కడప డెంటల్ కాలేజీలో మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ప్రజాప్రతినిధులకు ఆహ్వానం లేదు. అధికారులు చాలానిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఎమ్మెల్సీ రామగోపాల్, ఎమ్మెల్యే మాధవి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 9న సీఎం చంద్రబాబు గండికోట వస్తున్నారు. ఈ సమాచారం ఉందా అని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అడిగారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ.. కడప జిల్లాలో ప్రత్యేక రాజ్యాంగం ఉందా.. ప్రోటోకాల్ పాటించకపోతే బాధ్యులపై చర్యలు తప్పవు అని హెచ్చరించారు. వచ్చే సమావేశం నాటికి ఈ రోజు చర్చకు వచ్చిన సమస్యలకు పరిష్కారం కావాలన్నారు. సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం

తొలిసారిగా జిల్లాకు వచ్చిన మంత్రి సవితకు పలువురు ఘన స్వాగతం పలికారు. ఉదయం 11.55 గంటలకు కడప ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి సవిత చేరుకున్నారు. కలెక్టర్ అదితిసింగ్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఆహ్వానం పలికారు. మంత్రి పోలీసుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి, టీడీపీ నేతలు గోవర్ధనరెడ్డి, హరిప్రసాద్, పీరయ్య, రాంప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు. తొలుత బిల్టప్ వద్ద టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, అలంఖాన్‌పల్లెకు చెందిన టీడీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, కార్పొరేటరు ఉమాదేవి స్వాగతం పలికారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఉన్న మంత్రిని కడప టీడీపీ నేత అమీర్‌బాబు, సురేశ్‌నాయుడు, ముక్తియార్ తదితరులు కలిశారు.

అక్రమాల గుట్టు తేల్చాలి : వరద



గృహ నిర్మాణంపై చర్చ జరుగుతుండగా "ప్రొద్దుటూరులో టీడీపీ హయాంలో ఎకరం రూ.5కోట్ల విలువ చేసే మున్సిపాలిటీ స్థలాన్ని టిడ్కో ఇళ్లనిర్మాణానికి ఇప్పించాం. 2019లో టీడీపీ దిగిపోయేనాటికి టిడ్కో ఇళ్లు నిర్మాణాల్లో ఉన్నాయి. వాటిని వైసీపీ హయాంలో పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వకుండా పడగొట్టి అందులో ఉన్న ఇనుమును అమ్ముకున్నారు. అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు" అంటూ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రశ్నించారు. రిపోర్టు తయారు చేసి ఎండీకి పంపించామని ఈఈ సమాధానమివ్వగా వరదరాజులరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు తెలియకుండా ఎలా పంపించారని ప్రశ్నించారు. బాధ్యులపై కఠిన చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరులో 3051 ఇళ్లు పూర్తయ్యాయని పీడీ చెబుతుండగా, అన్ని ఇళ్లు పూర్తయ్యాయన్నారు కదా ఒక్కరైనా చేరారా? ఇళ్లన్నీ నాసిరకంగా కట్టారని అన్నారు. రైతుల నుంచి ఎకరా రూ.20లక్షలకు తీసుకుని జగనన్న కాలనీల పేరుతో ప్రభుత్వానికి రూ.40లక్షలకు అమ్మి దోపిడీ చేశారంటూ మండిపడ్డారు.

బోగస్ లబ్ధిదారులు : రామగోపాల్‌రెడ్డి



పులివెందుల జగనన్న లేఅవుట్‌లో 2,800 ఇళ్లు బోగస్ లబ్ధిదారులకు ఇచ్చారని వాటిపై ఏమి చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. విజిలెన్స్ విచారణ పూర్తయిందని పీడీ సమాధానమివ్వగా, విజిలెన్స్ నివేదికను ప్రభుత్వానికి పంపకుండా మీరే ఇక్కడ తొక్కిపెట్టారని, వైసీపీతో కుమ్మక్కై ఇదంతా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బద్వేలు, ప్రొద్దుటూరులో టిడ్కో ఇళ్ల కోసం లబ్ధిదారుల నుంచి డిపాజిట్లు సేకరించారని వాటిని వెనక్కి ఇవ్వాలని లబ్ధిదారులు మొత్తుకున్నా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. కడపలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 2019లోనే డ్రా తీసి లబ్ధిదారులకు ఇవ్వాల్సి ఉందని. అయితే వాటిని ఇవ్వకుండా వాటిపై రంగులు మాత్రం వేశారంటూ ఎమ్మెల్యే ఆర్.మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న ఇళ్లనిర్మాణంలో జరిగిన అక్రమాలలో ఎంతటివారినైనా వదిలే ప్రసక్తి లేదంటూ మంత్రి సవిత హామీ ఇచ్చారు.



- పట్టపగలే అమ్మకాలు
- గ్రామ గ్రామాన బెల్టుషాపులు
- సీఎం ఆదేశాలు బేఖాతర్
- మద్యంషాపుల వద్ద కానరాని నిబంధనలు
- షాపు వద్దనే మద్యపానం
- పట్టించుకోని ఎక్సైజ్‌శాఖ

కిరాణా కొట్టుల్లో మద్యం..!

పులివెందులటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సరసమైన ధరలకే నాణ్యమైన మద్యం అందుబాటులోకి తేవాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యానికి మద్యం షాపుల యజమానులు తూట్లు పొడుస్తున్నారు. మద్యం దుకాణాల్లో అమ్మకాలకంటే.. గ్రామ గ్రామాన బెల్టుషాపులు ఏర్పాటు చేసి సరకు అక్కడికి తరలించి అమ్ముకోవడానికి మక్కువ చూపుతున్నారు. ఎమ్మార్పీ కన్నా అదనంగా అమ్మడానికి ఎక్సైజ్ అధికారులు ఒప్పుకోవడం లేదు. దీంతో వారు బెల్టుదుకాణాలు పెంచుకుంటున్నారు. ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహించినా, వారికి మద్యం సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఆ ఆదేశాలను పులివెందులలో ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. కిరాణా కొట్టుల్లో కూడా మద్యం అమ్మకాలు పట్టపగలే యథేచ్ఛగా సాగుతున్నాయి.

బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు

- చెన్నారెడ్డి, ఎక్సైజ్ సీఐ

పులివెందుల డివిజన్ పరిధిలో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. వేలంపాటలో మద్యం షాపులు దక్కించుకున్నవారు ఎమ్మార్పీకే విక్రయించాలి. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేసి షాపు లైసెన్సు రద్దు చేస్తాం. ఇటీవల బెల్టుషాపులపై రెండు కేసులు నమోదు చేశాం.

నిబంధనలు గాలికి

మద్యం షాపుల్లో నిబంధనలు పాటించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. షాపుల్లో తప్పనిసరిగా మద్యం ధరల పట్టికలు ప్రదర్శించేలా చూడాలని, ప్రతి మద్యం షాపులో రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినా పట్టించుకోవడం లేదు. షాపుల వద్ద మద్యాన్ని తాపించడం నిషేధం. అయితే పట్టణంలో పలు మద్యం షాపుల వద్దనే తాగిస్తున్నారు. మద్యంతో పాటు షాపులోనే గ్లాసులు, తినుబండారాలు అమ్ముతున్నారు. మద్యం ప్రియులకు అక్కడే మద్యం తాగే వెసులుబాటు కల్పించారు. దీంతో మందుబాబుల వల్ల చుట్టుపక్కల షాపుల నిర్వాహకులు, అటుగా వెళ్లే పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదంతా ఎక్సైజ్‌శాఖకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

అధిక ధరలకు విక్రయాలు

నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చి నెల రోజులు కాకపోయినా గ్రామ గ్రామాన బెల్టు దుకాణాలు వెలిశాయి. బెల్టు దుకాణాల్లో బాటిల్‌పై ఎమ్మార్పీ కన్నా రూ.20 నుంచి రూ.50 అదనంగా వసూలు చేస్తూ దర్జాగా విక్రయాలు చేస్తున్నారు. అయినా ఎక్సైజ్ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఎమ్మార్పీకే మద్యం దొరుకుతుందని మందుబాబులు ఆశించారు. అయితే మద్యంతో ఆదాయం పెంచుకోవాలన్న లక్ష్యంతో వ్యాపారులు సర్దుబాటు చేసుకుని గ్రామాల్లో బెల్టుషాపులకు తెరలేపారు. కూల్‌డ్రింక్ షాపులు, కిరాణాషాపుల్లో పోటాపోటీగా అధిక ధరలతో మద్యం అమ్మకాలు ప్రారంభించారు. జనాభా అధికంగా ఉండే గ్రామాల్లో నాలుగైదు బెల్టుషాపులు కూడా మొదలు కావడం విశేషం. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో బెల్టుషాపులు ఏర్పాటు కావడంతో ఇష్టానుసారంగా అధిక ధరలకు అమ్ముతున్నా రన్న విమర్శలున్నాయి. వేంపల్లె, ఉలిమెల్ల ప్రాంతాల్లో ఇటీవల బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఇద్దరిపై ఎక్సైజ్ అధికారులు కేసులు నమోదు చేశారు. అయినా బెల్టు నిర్వాహకులు ఏమాత్రం తగ్గడం లేదు. నిబంధనలు అతిక్రమిస్తున్న మద్యం షాపుల నిర్వాహకులపై ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పులివెందులలోని ఓ కిరాణా కొట్టులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మద్యం

అభివృద్ధి ప్రణాళికల తయారీలో..

అప్రమత్తత అవసరం

- డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ ఓబులమ్మ



కడపరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని.. లేదంటే నిధుల విడుదలలో సమస్యలు వస్తాయని డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, వైస్ ప్రిన్సిపాల్, డీపీవో రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పంచాయత్ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ) తయారీపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని 50 మండలాలకు గాను మొదటి విడత 25 మండలాలకు ప్రస్తుతం రెండురోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని.. మిగిలిన మండలాలకు 7, 8 తేదీలలో శిక్షణ ఉంటుందన్నారు. నిర్దేశించిన తేదీలలో ప్రతి మండలం నుంచి ఒక ఎంపీడీవో, ఒక ఈవోపీఆర్డీ, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఒక డిజిటల్ అసిస్టెంట్ తప్పక శిక్షణకు హాజరు కావాలన్నారు. గ్రామ, మండల, జిల్లా పరిషత్ స్థాయిలో 2025-26 సంవత్సరానికి ప్రణాళికలను రూపొందించేందుకు శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణలో డీఎల్‌పీవోలు, డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ భాస్కర్, ఏవో బండపల్లి నాగభూషణం, సురేశ్, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

9న సీఎం చంద్రబాబు రాక

కడప, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు 9వ తేదీ శనివారం గండికోట పర్యటనకు రానున్నారు. ఈ మేరకు అధికారికంగా పర్యటన ఖరారైంది. అయితే పర్యటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా రాలేదు. 9న వస్తున్నట్లు సమాచారం అందిందని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ డీఆర్‌సీ సమీక్ష సమావేశంలో వెల్లడించారు.

నేడు బాధ్యతలు చేపట్టనున్న కలెక్టర్

జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ చెరుకూరి శ్రీధర్ బుధవారం ఉదయం తన చాంబరులో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు రెవెన్యూ వర్గాలకు సమాచారం అందింది.

బయట వ్యక్తులను అనుమతించకండి

- ఎస్పీని కోరిన వైసీపీ కార్పొరేటర్లు

కడప క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్‌లో 7వ తేదీ గురువారం జరుగుతున్న సర్వసభ్య సమావేశంలో బయట వ్యక్తులను అనుమతించకూడదని డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. వైసీపీకి చెందిన పలువురు కార్పొరేటర్లతో ఆయన మంగళవారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. గత సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లు మాట్లాడుతున్నప్పుడు కొంతమంది బయట వ్యక్తులు వచ్చి రన్నింగ్‌కామెంట్ చేశారన్నారు. మహిళా కార్పొరేటరు భర్తలను పోలీసులు కనీసం నగరపాలకసంస్థ కార్యాలయ ఆవరణలోకి కూడా అనుమతించలేదన్నారు. జనరల్ బాడీ మీటింగ్‌కు కార్పొరేషన్ అధికారులు, జర్నలిస్టులు, కార్పొరేటర్లకు మాత్రమే అనుమతించాలని కోరామని దీనికి ఎస్పీ సానుకూలంగా స్పందించారన్నారు.


పోలీసుభద్రత కోరడం సిగ్గుచేటు: లింగారెడ్డి

కడప మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి వైసీపీ కార్పొరేటర్లు భద్రత కోరడం సిగ్గుచేటని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీని ఆయన మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డితో కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కార్పొరేషన్ సమావేశంలో మేయరు పక్కన ఎమ్మెల్యేలను ఎలా కూర్చోబెట్టారని ప్రశ్నించారు. ప్రజాసమస్యలు తెలుసుకునే అవసరం ఎమ్మెల్యేలకు ఉందన్నారు. మీరు దౌర్జన్యాలు, చట్టవ్యతిరేక పనులు చేశారు కాబట్టే ఈ రోజు టీడీపీ ఎమ్మెల్యేలు కూర్చుంటే భయపడిపోయి ఎస్పీకి ఫిర్యాదు చేశారన్నారు.

బడిపంతుల గడ్డ.. పిట్టిగుంట

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అంటారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత స్థానం ఉపాధ్యాయుడిది. అలాంటి గురువులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది ఆ గ్రామం. కేవలం 75 కుటుంబాలున్న ఆ గ్రామంలో ఎక్కువమంది ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. ఓ ఇంజనీరు తప్పుచేస్తే తాను నిర్మించిన బ్రిడ్జి మాత్రమే కూలిపోతుంది. ఉపాధ్యాయుడు తప్పుచేస్తే సమాజమే పెడదారి పడుతుందంటారు పెద్దలు. అలాంటి బాధ్యతాయుతమైన ఉపాధ్యాయ కొలువులతో గ్రామానికే వన్నె తెస్తున్నారు.

- ఓ కుగ్రామంలో 38 మంది ఉపాధ్యాయులు
- సంపూర్ణ అక్షరాస్యత
- ఆదర్శ గ్రామంగా గుర్తింపు



కాశినాయన, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలంలోని పిట్టిగుంట గ్రామంలో దాదాపు 75 కుటుంబాలున్నాయి. దాదాపు ఒకే సామాజికవర్గం. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న ఓ కుగ్రామం అది. సువిశాలమైన వ్యవసాయ భూములులేవు.. మంచి గుర్తింపు ఉన్న నాయకులు లేరు.. సంపన్నులూ అక్కడ లేరు. ఒక సాధారణమైన దిగువ మధ్యతరగతి వారు నివసించే పల్లెటూరు. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలు అధికంగా ఉండేవారు. 1955 సంవత్సరం నాటికి ఆ గ్రామంలో నిరక్షరాస్యత పేదరికం జంటగా ఉండేవి. కేవలం వేళ్లమీద లెక్కించే సంఖ్యలో మాత్రమే గ్రామంలో అక్షరజ్ఞానం కలిగిన వారు ఉండేవారు.

గ్రామంలో తిండికి సంపాదించకోవడమే అతి కష్టంగా ఉండే రోజులవి. అలాంటి రోజుల్లో గ్రామం నుంచి కలసపాడు, పోరుమామిళ్లకు దాదాపు రోజుకు 20 కి.మీ దూరం నడిచిపోయి వస్తూ కొంతమంది యువకులు చదువుకున్నారు. బతకలేక బడిపంతులు అనే నానుడి ఉన్న ఆ రోజుల్లోనే పలువురు యువకులు ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, హైయ్యర్ గ్రేడ్ లాంటి చదువులు చదివి అవసరమైన ట్రైనింగ్‌లు పూర్తిచేసి ఉపాధ్యాయ వృత్తిలోకి దిగారు. గ్రామానికి చెందిన కీర్తిశేషులు బుసిరెడ్డి జానకిరామిరెడ్డి మొట్టమొదటగా 1962 సంవత్సరంలో నెలకు రూ.92 వేతనంతో బడిపంతుల కొలువు సంపాదించాడు.

దీంతో ఇతర పిల్లల తల్లిదండ్రుల్లో కూడా తమ బిడ్డలను అయ్యవార్లను చేయాలనే ఆలోచన రేకెత్తించింది. అనుకున్నదే తడవుగా అనతి కాలంలోనే బి.పుల్లారెడ్డి, బోయిళ్ల నర్సిరెడ్డి, బి.చెంచిరెడ్డి, పి.బాలవెంకటరెడ్డి, పివెంకటసుబ్బారెడ్డితో పాటు పదుల సంఖ్యలో ఉపాధ్యాయ కొలువులు పొందారు. దీంతో గ్రామంలో చదువుకునే యువత దృష్టి ఉపాధ్యాయ వృత్తిపై పడింది. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా ఆ దిశగా అడుగులు వేస్తూ ఒక్కొక్కరుగా ఉపాధ్యాయ వృత్తిని సంపాదించుకుంటూ వచ్చారు. వారి సంఖ్య ప్రస్తుతం 38కి చేరింది. వీరిలో 8 మంది రిటైర్ కాగా ఐదారుగురు ప్రభుత్వ కొలువు లభించనప్పటికీ మంచి గుర్తింపు ఉన్న ప్రైవేట్ కాలేజీలైన బీఈడీ, బీటెక్, జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపల్స్‌గా, లెక్చరర్స్‌గా పనిచేస్తున్నారు.

ఉపాధ్యాయులు కావాలన్నదే లక్ష్యంగా..

చిన్నగ్రామంలో ఐదారు కుటుంబాల్లో భార్య భర్త ఇద్దరూ టీచర్లుగా ఉండటం విశేషం. మునుపటి తరంవారే కాకుండా తర్వాత తరంవారు కూడా బోధనపైనే మక్కువ పెంచుకున్నారు. స్వరాష్ట్రంలో సీట్లు లభించకపోతే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు పోయి టీటీసీ, బీఈడీ, ఎంఈడీ లాంటి ఉన్నత చదువులు చదివి బోధనలోనే స్థిరపడ్డారు. అప్పట్లో 90 శాతంమంది యువకులు ఉపాధ్యాయ కొలువు పొందాలన్నదే లక్ష్యంగా చదువులు చదివారు. దీంతో ప్రతి కుటుంబంలో ఒకరిద్దరు డిగ్రీలు, పీజీలు, టీటీసీ, బీఈడీ చేశారంటే నాటి యువతలో బోధనపై ఎంత మక్కువ ఉండేదో ఇట్టే అర్థమవుతుంది.

ఆదర్శ గ్రామం కావడంతో..

సంపూర్ణ అక్షరాస్యత ఉండటంతో చాలాకాలం క్రితమే పిట్టిగుంటను ప్రభుత్వం ఆదర్శగ్రామంగా గుర్తించింది. దీంతో మండలంలో ప్రభుత్వ పరంగా ఏ కార్యక్రమం ప్రారంభించాలన్నా పిట్టిగుంట గ్రామాన్నే అధికారులు పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేస్తారు. ఇటీవల గ్రామంలోని యువత ట్రెండ్ మారింది. ఇప్పుడు ఉపాధ్యాయ వృత్తేకాకుండా ఇతర వృత్తుల్లోకి వెళ్లేలా యువతీ యువకులు చదువుతున్నారు. ఇక్కడి యువత ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఏదోఒక జీవనోపాధి పొందుతూ చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. దీనంతటికి వెనకటి తరం అయవార్లదే పునాది అని నేటికీ గ్రామస్తులు, చుట్టుపక్కల మండలాల్లోని ప్రజలు గుర్తుచేస్తుంటారు.


పిట్టిగుంట గ్రామం వ్యూ

రూ.92 జీతానికి చేరాను



పేదరికం, నిరక్షరాస్యత కవల పిల్లల్లా సంచారం చేస్తున్న రోజులవి. చదువుకోవాలని ఉన్నా చదివించలేని పేద కుటుంబాలు ఎక్కువగా ఉన్న గ్రామం మాది. బడికి వచ్చినా ప్రాథమిక దశలోనే బడి మానేసి వ్యవసాయ పనులకు వెళ్లేవారు. అలాంటి పరిస్థితుల్లో నేను మెట్రిక్యులేషన్ వరకు చదివి అనంతరం శ్రీకాళహస్తిలో ట్రైనింగ్ పూర్తిచేశాను. 1962 సంవత్సరంలో రూ.92ల జీతానికి టీచర్‌గా చేరాను.

- బి.పుల్లారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు, పిట్టిగుంట


ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ



నేను మొదట ఆర్మీలో చేరాను. కొన్నిసంవత్సరాలు దేశరక్షణలో పాలుపంచుకున్నాను. నేను బయటికి వచ్చేనాటికి గ్రామంలో ఎక్కువ మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మరికొందరు ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కసరత్తు చేస్తున్నారు. నాకు ఆ వృత్తిపై మక్కువ కల్గింది. నేనూ బీఈడీ చేశాను. అనంతరం నిర్వహించిన డీఎస్సీలో సైన్సు ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యి పనిచేస్తున్నాను

- బోయిళ్ల విద్యార్థన్‌రెడ్డి, సైన్సు ఉపాధ్యాయుడు, పిట్టిగుంట

జీతం తక్కువ.. గౌరవం ఎక్కువ...



నేను రూ.150 జీతానికి ఉద్యోగంలో చేరాను. ఆ రోజుల్లో జీతం తక్కువైనా గౌరవం ఎక్కువగా లభించేది. గ్రామంలో దిగీదిగగానే బస్టాప్ నుంచి ఐదారు మంది ఉపాధ్యాయుడిని అనుసరిస్తూ ఆప్యాయంగా మాట్లాడుతూ బడి వరకు వచ్చేవారు. దీనికి తోడు పాత రోజుల్లో ఉపాధ్యాయులు కొంతైనా నైతిక విలువలు పాటిస్తూ వచ్చేవారు. మా గ్రామంలోని యువత కూడా మాలాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు.

- చలపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, పిట్టిగుంట

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

చిన్నమండెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టరు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పడమటికోన పంచాయతీ నడిగడ్డపల్లెకు చెందిన రామంజులమ్మ (57) ఆమె భర్త నాగరాజుతో కలసి మంగళవారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని పోస్టాఫీసు వద్దకు వచ్చింది. పని ముగిసిన అనంతరం స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా చిన్నమండెం, పెద్దమండెం రహదారిలోని చాంద్‌బాషా మామిడితోట వద్ద ట్రాక్టర్ ఢీకొంది. దీంతో కిందపడిన ఆమె పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రీసర్వే అర్జీలను త్వరగా పరిష్కరించాలి

రాయచోటి (కలెక్టరేట్), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ప్రక్రియలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వెలగపూడి సచివాయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, సర్వేశాఖ అధికారులతో సీసీఎల్ఏ జయలక్ష్మి రీసర్వే ప్రక్రియపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ శ్రీధర్ ఈ సమావేశానికి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఇప్పటివరకు జరిగిన గ్రామ సభల్లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, సర్వేశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో మధుసూదనరావు, ఏడీ సర్వే భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు కూల్చివేత

- ప్రభుత్వ స్థలాలు అమ్మిన వారిపై చర్యలు : కలెక్టర్ చామకూరి శ్రీధర్


ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

కురబలకోట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను అధికారులు మంగళవారం కూల్చివేశారు. వివరాలిలా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల పాపం....పేదల పాలిట శాపంగా మారింది. మండలంలోని అంగళ్లు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 118లో రస్తా పొరంబోకు స్థలంలో 28 సెంట్ల స్థలాన్ని గత ప్రభుత్వ హయాంలో అధికార నేతలు కొంతమంది ఇస్టానుసారంగా ఆక్రమించుకుని అమ్మకాలు చేపట్టారు. ఈ స్థలానికి నకిలీ పట్టాలు సృష్టించి 12 మందికి రూ.3.50 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు అమ్మకాలు చేపట్టి సొమ్ము చేసుకున్నారు.

ఆ భూమికి పట్టాలు పొందామని ఇక అ స్థలం మాదేనని భావించి లక్షలాది రూపాయలు వెచ్చించి పలువురు నిర్మాణాలు చేపట్టారు. దీనిపై పలుమార్లు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నిత్యం ఆ మార్గంలో పలువురు జిల్లా, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులు రాకపోకలు సాగించినా అటువైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేదు. అయితే కూటమి అధికారంలో రావడంతో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలానికి సంబంధించి పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఇటీవల తాజాగా ఆక్రమణకు గురైన భూమిలో ప్రభుత్వానికి చెందిన భూమిగా నిర్థారిస్తూ రెవెన్యూ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. దీని విలువ ప్రైవేట్ మార్కెట్‌లో కోట్లలో పలుకుతుంది. కాగా మంగళవారం రెవెన్యూ అధికారులు ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణాలను యంత్రాల సాయంతో కూల్చేశారు. కాగా నేతల చేతిలో మోసపోయి అక్రమ నిర్మాణాలు చేపట్టిన బాధితులు లబోదిబోమంటున్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంగళవారం ఆక్రమణకు గురైన స్థలం వద్దకు చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఇంతవరకు ఎందుకు అడ్డుకోలేదని అధికారులను ప్రశ్నించారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే అడ్డుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించడంతో పాటు సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలాలను అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తపస్విని, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ భువనేశ్వరి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు భవనాల్లోకి కోర్టు

- ఆమోదం తెలిపిన ప్రభుత్వం

కలికిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా కేంద్రంలో కొన్ని కోర్టుల నిర్వహణకు తీసుకున్న ప్రైవేటు భవనాలకు అద్దె చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప కేంద్రంగా ఉన్న కొన్ని కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని మరమ్మతులు చేసేందుకు వీలుకాని స్థాయిలో ఉన్నాయి. చివరికి ప్రాణాలకు హాని కలిగించే విధంగా ఉన్నందువల్ల వివిధ కోర్టుల నిర్వహణకు ప్రైవేటు భవనాలను ఎంచుకున్నారు. స్థానికంగా ఉన్న ఆక్స్‌ఫర్డ్ జే స్కూల్ భవనాలు కోర్టుల నిర్వహణకు అనువుగా ఉన్నందున నెలకు రూ.1.20 లక్షలు అద్దెగా రాష్ట్ర హైకోర్టు నిర్ణయించింది. ఐదవ అదనపు జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను ఈ ప్రైవేటు అద్దె భవనాల్లో నిర్వహించేందుకు హైకోర్టు అనుమతించింది. వీటితో పాటు కడప జిల్లాకు సంబంధించి రాయచోటిలో ఉన్న మధ్యవర్తిత్వ న్యాయ సేవా విభాగం (ఎంఎల్ఎస్ఏ) కార్యాలయాన్ని కూడా ఈ అద్దె భవనాల్లో ఏర్పాటు చేసేందుకు హైకోర్టు నిర్ణయించింది. హైకోర్టు నిర్ణయించిన అద్దెను నిర్ధారించేందుకు హైకోర్టు రిజిస్ట్రారు (రిక్రూట్‌మెంట్) ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. హైకోర్టు నిర్ణయించిన అద్దెతో ప్రైవేటు భవనాల్లో కోర్టులను నిర్వహించేందుకు హైకోర్టు తీసుకున్న నిర్ణయానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర న్యాయ, శాసన సభా వ్యవహారాల శాఖ కార్యదర్శి వి.సునీత మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి : జేసీ


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

మదనపల్లె అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితుల సర్వే సక్రమంగా నిర్వహించి వారికి పారితోషికం సకాలంలో చెల్లించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులతో సమీక్షించిన ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని, రికార్డుల గదిని పరిశీలించారు. రైతుల నుంచి వినతులను స్వీకరించారు. తట్టివారిపల్లె వద్ద రైతులు అబ్జెక్షన్ తెలిపిన ఇళ్లను, భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్ భూములను సక్రమంగా సర్వే నిర్వహించాలన్నారు. మదనపల్లె పట్టణం పరిసర ప్రాంతాల్లో చెరువులు అక్రమణకు గురైనట్లు, ప్రభుత్వ భూఆక్రమణ చాలా వరకు చేసిన విషయం తన దృష్టికి వచ్చిందని వెంటనే సర్వే నిర్వహించి ఏడు రోజుల్లో అక్రమాలను తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆధార్ కార్డులోని వివరాలను, లేదా పాఠశాల వివరాలతో మార్పులు చేయాలని, కరెక్షన్ చేసి వెంటనే వారికి సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి సిబ్బందిని త్వరలోనే పంపుతామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఖాజాబీ, డీటీ అస్లాం, వీఆర్వోలు పాల్గొన్నారు.

బొప్పాయి మొక్కలకు భలే గిరాకీ

- 30 నర్సరీల్లో బొప్పాయి మొక్కల పెంపకం
- నాలుగు రాష్ట్రాలకు 30 లక్షలకు పైగా మొక్కలు సరఫరా
- 2 వేల మంది కూలీలకు ఉపాధి

రైల్వేకోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రతిఏటా బొప్పాయి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఏడాది లక్ష ఎకరాల్లో కోటి మొక్కలను రైతులు నాటారు. రైల్వేకోడూరులోని 30 నర్సరీల్లో బొప్పాయి మొక్కల పెంపకాన్ని చేపట్టారు. మన రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలకు ఇక్కడి నుంచి 30 లక్షల మొక్కలను నర్సరీ వ్యాపారులు ఎగుమతి చేశారు వివరాల్లోకి వెళితే...రైల్వేకోడూరు ప్రాంతం వాణిజ్య పంటలకు కేంద్ర బిందువు. ఇక్కడ మామిడి, అరటి తరువాత బొప్పాయి పంటను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. బొప్పాయి కాయలు సీజన్ లో మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, ఢిల్లీ, కశ్మీర్, అహ్మదాబాద్, హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలకు ఎగుమతి చేస్తారు. గత ఏడాది బొప్పాయి గింజలు నాసిరకంగా ఉండడంతో రైతులు నిలువునా మునిగిపోయారు. దిగుబడులు ఎక్కువగా రాలేదు. అయితే కాయలు టన్ను రూ.20 వేల వరకు ధరలు పలికాయి. ఈ ఏడాది నాణ్యత గల గింజలు తెచ్చి నర్సరీల్లో పెంపకం చేశామని వ్యాపారులు అంటున్నారు. గత ఏడాదిలో ఒక్క మొక్క రూ.13కు విక్రయాలు చేశారు.

ఈ ఏడాది ఒక్క మొక్క రూ.11కు విక్రయిస్తున్నారు. డిమాండు పెరిగే కొద్ది రూ.14 నుంచి రూ.15 వరకు మొక్కలను అమ్ముతారు. రైల్వేకోడూరు ప్రాంతంలో ప్రధానంగా రెడ్‌లేడి 786, తైవాన్ రకాన్ని రైతులు సాగు చేస్తున్నారు. ఎకరాకు సుమారు 1000 మొక్కలు నాటుతారు. ఎకరాకు పొలంలో బొప్పాయి సాగు చేపట్టాలంటే దుక్కులు, కూలీలు, మందులు, మొక్కలు తదితర వాటికి రూ.40 వేలు ఖర్చు అవుతుంది. వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు సుమారుగా రూ.2 లక్షలు లాభం వస్తుందని రైతులు అంటున్నారు. అయితే బొప్పాయి వ్యాపారంలో దళారులు ఉన్నారు. దీంతో చాలా మేరకు రైతుకు నష్టం ఏర్పడుతోంది. మార్కెట్‌లో ధరలు లేవని దళారులు చెప్పి రైతులను నిలువునా మోసాలు చేస్తున్నారు. చాలా మంది రైతులు నేరుగా మార్కెట్‌కు కాయలు పంపిస్తున్నారు. బొప్పాయి సీజన్‌లో రైల్వేకోడూరు ప్రాంతంలో నెలలపాటు ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు మకాం వేసి ఇక్కడ వ్యాపారం కొనసాగిస్తారు. బడా రైతులు వారితో సంబంధాలు పెట్టుకుని వారి కాయలను ఆ వ్యాపారులకు ఇస్తున్నారు. కాయలు కొనుగోలు చేసే ముందు ఒక రేటు కాయలు కోసిన తర్వాత మరో రేటు చెబుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోజు 50 లారీలకు పైగా బొప్పాయి కాయలను ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారు. 2 వేల మంది కూలీలు జీవనోపాధి పొందుతున్నారు. గుత్తి, గుంతకల్లు, అనంతపురం, కర్నూలు, తాడిపత్రి తదితర ప్రాంతాలకు చెందిన కూలీలు ఇక్కడ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అధికంగా లాభాలు వస్తున్నాయని రైతులు సాగును వదలడం లేదు. ఏదీఏమైనా బొప్పాయి కాయలకు డిమాండు తగ్గడం లేదు.


రైల్వేకోడూరు నర్సరీలో పెరుగుతున్న బొప్పాయి మొక్కలు

నాణ్యత గల మొక్కలను ఇస్తున్నాము



నాణ్యత గల మొక్కలను రైతులకు అందించాము. వైరస్ లేని మొక్కలు ఇచ్చాము. రైతులు లాభాలు తెచ్చుకోవాలంటే సేంద్రియ వ్యవసాయం చేయాలి. మొక్కలు నాటినప్పటి నుంచి జాగ్రత్తగా శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకుని రైతులు సాగు చేయాలి. బొప్పాయి సాగుకు వాతారవణం అనుకూలించాల్సి ఉంటుంది. బొప్పాయి నాటిన తర్వాత వర్షం కురవకూడదు. వైరస్ రాకుండా ఉండాలంటే నాటిన నాటి నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లాభాలు వస్తాయని విచ్చలవిడిగా మందులు పిచికారీ చేస్తే ఇబ్బందులు వస్తాయి.

- ఎస్.రవికుమార్‌రాజు, నర్సరీ వ్యాపారి, కోడూరు

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం

గుర్రంకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భార్యను కాపురానికి పిలిపించాలని పోలీస్ స్టేషన్‌కు వస్తే పట్టించుకోలేదంటూ ఓ యువకుడు గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి వివరాల మేరకు... తరిగొండ పంచాయతీ ఇరగన్నగారిపల్లె వాసి నరసింహులు కుమారుడు మణికి తిరుపతి జిల్లా భాకరాపేట మండలం తలకోన పంచాయతీ ఆవులయ్యగారిపల్లెకు చెందిన రమణ కుమార్తె మానసతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పది రోజుల కిందట భార్యాభర్తలిద్దరూ గొడవపడ్డారు. దీంతో మానస పిల్లలను వదిలి అమ్మగారి ఇంటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో మణి తన భార్యను కాపురానికి పిలిపించాలంటూ వారం రోజులుగా గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు. పోలీసులు తనదే తప్పంటూ నిందించడంతో మనస్థాపానికి గురైన యువకుడు బ్లేడుతో ఎడమ చేతిపై కోసుకుని కడప-బెంగళూరు జాతీయ రహదారిపై పడుకుని నిరసన వ్యక్తం చేశాడు. అక్కడే ఉన్న పోలీసులు బాధితుడికి సర్దిచెప్పి లోపలికి తీసుకెళ్లారు. అతడి భార్యను పిలిపించి న్యాయం చేస్తామని ఎస్ఐ మధురామచంద్రుడు బాధితునికి నచ్చచెప్పాడు.


చేతిపై బ్లేడుతో కోసుకున్న దృశ్యం

నత్తనడకన కంప్యూటరీకరణ

- స్తంభిస్తున్న కార్యకలాపాలు
- పీఏసీఎస్‌లో పంట రుణాలకు ఇక్కట్లు
- గతంలో వందల కోట్లు రుణం
- ఇప్పుడు రూ.50కోట్లు దాటని వైనం
- పైలెట్ ప్రాజెక్టు కింద నాలుగు సొసైటీలు



కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):
- ఇగో రామయ్యా.. గతంలో తీసుకున్న రుణానికి వడ్డీ కట్టాలే. చాణ రోజుల నుంచి పెండింగు చూపిస్తాంది, వెంటనే కట్టుకో లేదంటే ఇబ్బంది పడాల్సి వచ్చాది చూడు మల్ల ముందే చెబుతాండా.

! అదేందయ్యా నేనే పతిసారీ వడ్డీ కడతాండ. మీరు బుక్కల్లో రాసుకోకండా తినేసి మళ్లా నన్ను వడ్డీ కట్టలేదంటే యాన్నిoచి తేవాలయ్యా సామీ, నేను కట్టలేను.

- ఇదో లచ్చుమయ్యా.. మీ నాయన సొసైటీ బాంకిలో అప్పుడు ఎప్పుడో లోను తీస్కున్నాడు. వడ్డీతో కలిపి బాకీ తీరిచ్చే.. భూమి ఉంటాది.. లేదంటే ఏలమేయాల్సి వచ్చాది.

! ఏందయ్యా మా భూమి కుదవ పెట్టి సొసైటీ బాంకిలో లోను తీసుకోని మల్లా గడువు ముందే కట్టినన్నాడు. మల్లా లోను తీసుకున్న ఇషయమే మా నాయన మాకు చెప్పలే, ఇప్పుడు ఉన్నట్టుండి భూమి ఏలం వేచ్చామంటుండరు యాందీ ఇదంతా..

ఇప్పటి వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలలో రైతులు, సొసైటి బ్యాంకు అధికారుల మధ్య జరుగుతున్న తంతు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సొసైటీలలో లావాదేవీలకు సంబంధించి కంప్యూటరీకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఇది నత్తనడకన సాగుతుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. వివరాల్లోకి వెళితే..

గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు రుణాలు ఇచ్చేందుకు సహకారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ (పీఏసీఎస్)లలో రికార్డుల నిర్వహణ చేతిరాతతో ఉండడంతో ఎంతో కొంత అవకతవకలకు ఆస్కారం ఉంటుంది. కొన్ని చోట్ల సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం వల్ల రైతులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. మరికొన్ని చోట్ల డబ్బులు చెల్లించకుండా తాము కట్టాం, మీరు తినేసి మళ్లీ కట్టమంటున్నారంటూ బుకాయించేవారు ఉండే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. పీఏసీఎస్‌లను కంప్యూటరీకరించాలని నిర్ణయం తీసుకుంది. మొదటగా కొన్ని సొసైటీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసుకుని అవి పూర్తి కాగానే దశల వారీగా అన్ని సొసైటీలను కంప్యూటరీకరించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో మన జిల్లాలో మైదుకూరు ఎఫ్ఏసీఎస్, లక్కిరెడ్డిపల్లె, లింగాపురం, తిమ్మసముద్రం పీఏసీఎస్‌లను ఎంపిక చేశారు. వీటిలో పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ గడువు పూర్తయినా లక్ష్యం నెరవేరలేదు.

సిబ్బందికి శిక్షణ ఇచ్చినా...

సొసైటీల కంప్యూటరీకరణ కోసం సొసైటీ సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వడం జరిగింది. కానీ వారిలో కొంతమందికి కంప్యూటరు పరిజ్ఞానం లేకపోవడంతో కంప్యూటరీకరణ నత్తనడకన సాగుతున్నట్లు తెలుస్తోంది. మొదట సెప్టెంబరు మాసాంతానికి పూర్తి చేయాలనుకున్నారు. కానీ వివిధ కారణాల వల్ల గడవు పొడిగించినట్లు తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సొసైటీల కంప్యూటరీకరణ కోసం రూ.2500 కోట్లు నిధులు కేటాయించినట్లు సమాచారం. అయితే కంప్యూటరీకరణలో సాఫ్ట్‌వేర్ సంస్థలకు అప్పగిస్తే పనులు త్వరితగతిన పూర్తయ్యే అవకాశాలు లేకపోలేదు. కానీ రాష్ట్రస్థాయిలో సహకార శాఖ ఉన్నత అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సొసైటీల్లో కంప్యూటకీరణ పూర్తయితే రైతులకందించే రుణాలు, వడ్డీల్లో తేడాలు రాకుండా మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వీలవుతుంది. అంతేకాకుండా రైతులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు కూడా సొసైటీల ద్వారా సాయమందించే ఆలోచనలో ప్రభుత్వం యోచిస్తోంది. ఈ తరుణంలో జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టర్లపై కూడా రాష్ట్రప్రభుత్వం వత్తిడి తీసుకురానున్నట్లు సమాచారం.

పంట రుణాలకు ఇబ్బందులు

డీసీసీ బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల పరిధిలో సభ్యులైన రైతులకు కోట్లాది రూపాయలు పంట రుణాలు అందజేస్తారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం 350 నుంచి రూ.400 కోట్లు రుణాలు అందించేవారు. అయితే కంప్యూటరీకరణ పనుల వల్ల రుణాలు అందించడంలో కూడా కొంత జాప్యం జరిగే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.50 కోట్లు కూడా ఇచ్చే పరిస్థితులు ఉండవని అధికార యంత్రాంగం చెబుతుంది. రుణాల విషయం అటుంచితే, రికవరీలో కూడా ఆలస్యం అవుతున్నట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై జిల్లా సహకార శాఖాధికారి సుభాషిణిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. డీసీసీ బ్యాంకులోని ప్రత్యేక విభాగం కంప్యూటరీకరణను పరిశీలిస్తుందని, పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.

పెన్నానదిలో బాలుడు గల్లంతు

- డ్రోన్ కెమెరాలతో పరిశీలన
- కొనసాగుతున్న గాలింపు



పెన్నానదిలో బాలుడి ఆచూకీ కోసం డ్రోన్ కెమెరాలతో పరిశీలిస్తున్న దృశ్యం

కడప క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన మణికంఠ అనే బాలుడు ఆదివారం స్నేహితులతో కలిసి చెన్నూరు సమీపంలోని పెన్నానదిలో ఈతకు వెళ్లాడు. నలుగురు స్నేహితులు తిరిగి రాగా మణికంఠ పెన్నానదిలో గల్లంతైనట్లు తెలిసింది. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న చిన్నచౌకు పోలీసులు సోమవారం పెన్నానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. మూడు డ్రోన్ కెమెరాల సాయంతో బాలుడి ఆచూకీ కోసం పరిశీలిస్తున్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుకుపోయి ఉంటాడనే అనుమానంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చిన్నచౌకు సీఐ తేజమూర్తి, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టినా బాలుడి ఆచూకీ లభించలేదు. దీంతో అటు సిద్దవటం పోలీసుల సహకారంతో బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేదు. రాత్రి కావడంతో బుధవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టనున్నారు.

గంజాయి ముఠా అరెస్టు



నిందితులను చూపుతున్న సీఐ, ఎస్ఐలు

చాపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుపల్లె గ్రామం చెరువు గట్టపై మంగళవారం గంజాయి కలిగిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన తిరుమలరావు అక్కడ నుంచి గంజాయి తీసుకొచ్చి ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మేకల సునీల్, సురసుర శ్రీనివాసులు, గుర్రం రమేష్, పాపగాళ్ల సుధీర్‌లకు విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి 1కేజీ700 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.18 వేలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ముద్దనూరు నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి మంగపట్నం గ్రామానికి చెందిన బోడెద్దుల జగదీశ్వరరెడ్డి (27) అదృశ్యమ య్యాడు. నెల రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి ఇప్పటి వరకు రాలేదని అతని తండ్రి గోపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రాంబాబు తెలిపారు.

మెరుగ్గా గురుకులం విద్యార్థుల ఆరోగ్యం



చికిత్సపొందుతున్న వర్షిణి, విద్యార్థిని తల్లితో మాట్లాడుతున్న ఎంఈవో

కొండాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న వర్షిణి, పల్లవి అనే విద్యార్థినుల ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పల్లవి దాదాపు కోలుకుందని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వర్షిణిని ఎంఈవో రామయ్య మంగళవారం పరామర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారని ఎంఈవో తెలిపారు. ప్రిన్సిపల్ ప్రొద్దుటూరు హస్పిటల్‌లోనే ఉంటూ విద్యార్థిని వర్షిణి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నారు. కాగా గురుకుల పాఠశాలలో తక్షణం మౌలిక వసతులను కల్పించా లని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశించారని.. ఈమేరకు ప్రొక్లెయిన్‌తో పాఠశాలలో మంగళవారం చెత్త చెదారాన్ని తొలగించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, మండల బీజేపీ నేత శంకర్‌రెడ్డిలు తెలిపారు.

ఘనంగా కొండయ్యస్వామి పుట్టినరోజు వేడుకలు



భక్తుడికి కేకు తినిపిస్తున్న కొండయ్యస్వామి

మైదుకూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవధూత కొండయ్యస్వామి పుట్టిన రోజు వేడుకలను ధరణి తిమ్మాయపల్లెలో మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కొండయ్యస్వామికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కొండయ్యస్వామి చేతుల మీదుగా భారీ కేకు కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. కేకులను తీసుకునేందుకు భక్తులు క్యూలు కట్టారు. వేడుకలకు వచ్చిన భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జబర్దస్త్ ఆర్టిస్టుల కామిడీ ప్రోగ్రామ్ పలువురిని అలరించింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో తిమ్మయపల్లె గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. హరికథ కాలక్షేపానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

వక్తృత్వ వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో విద్యారంగంపై సాంకేతికత ప్రభావం అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం వైవీయూ మైనార్టీసెల్, బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్ విభాగం కన్వీనరు ప్రొఫెసరు రియాజున్నీసా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విద్యారంగం సాంకేతికత రెండూ వేరు చేసి చూడనంతగా కలిసి పోయాయని విద్యార్థులు మాటల్లో తెలిపారు. సాంకేతికత లేకుండా విద్యారంగాన్ని ఊహించలేమన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా సైకాలజీ సహాయాచార్యులు డాక్టర్ కె.లలిత, జెనెటిక్ అండ్ జెనోమిక్ విభాగం సహాయాచార్యులు మునికుమారి ఉర్దూవిభాగం అధ్యాపకులు వ్యవహరించారు. విద్యార్థులకు జాతీయ విద్యాదినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని ప్రొఫెసరు రియాజున్నీసా తెలిపారు.

ఎక్స్‌పోర్టర్లపై ఏపీఎండీసీ అధికారుల పక్షపాతం

- స్థానిక మిల్లుల యజమానుల నిరసన
- డిస్పాచ్ అడ్డగింత
- . బుజ్జగింపులతో ఆందోళన విరమణ



ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మిల్లు యాజమాన్యం

ఓబులవారిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముగ్గురాళ్ల విక్రయాల్లో మంగంపేట ఏపీఎండీసీ అధికారులు కొందరు ఎక్స్‌పోర్టర్లకే ప్రాధా న్యం ఇస్తూ తమకు అన్యాయం చేస్తున్నారంటూ స్థానిక లారీలు, మిల్లుల యజమానులు స్థానిక ఏపీఎండీసీ కార్యాలయం వద్ద నిర సన వ్యక్తం చేశారు. డిస్పాచ్‌ను అడ్డుకుని ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో అక్రమార్జనకు పాల్ప డ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికే అధిక ప్రాధాన్యమిస్తు న్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ఏపీఎండీసీ పరిపాలన భవనం ముందు స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఎక్స్‌పోర్టు వ్యాపారులకు ఆదివారం రాత్రి వేలాది టన్నుల రాయి తరలింపునకు ప్రత్యేక అనుమతులు ఇవ్వడం అన్యాయమన్నారు. ముడిసరుకు ఎగుమతిని నమ్ముకుని ఏర్పాటు చేసుకున్న స్థానిక మిల్లులకు, వాటిని నమ్ముకుని బతికే కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీపీవోకు విన్నవించారు. అధికారులు, మిల్లుల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని టీడీపీ యువ నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సందేశం పంపడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కల్లా చలపతి, బీజేపీ నాయకులు పులపత్తూరి రామసుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గునిపాటి రాయుడు, గునిపాటి వేణుగోపాల్, లారీ యజమానులు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్పీఎఫ్ ఎస్ఐ శివ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్నపేరూరు గ్రామ సమస్యపై ప్రభుత్వానికి నివేదిస్తాం



పెన్నపేరూరు గ్రామాన్ని సందర్శిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఒంటిమిట్ట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నపేరూరు గ్రామంలో సోమశిల వెనుకజలాల ద్వారా ఇళ్లు నీటమునగడంతో మంగళవారం ఇరిగేషన్ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. సోమశిల ఇరిగేషన్ ఎస్ఈ ఎంవీ వెంకటరామిరెడ్డి, ఈఈ వీవీ వెంకటరమణారెడ్డి, డీఈ శ్రీనివాస్‌కుమార్, ఏఈ శివప్రసాద్‌లు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. గతంలో సోమశిల జలాశయంలో 74 టీఎంసీలు పెట్టడంతో గ్రామంలో చుట్టూ నీరు చేరి కాలనీలు నీటమునిగాయని.. దీనిపై ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. గత ప్రభుత్వం గ్రామానికి చుట్టూ కాంక్రీట్‌వాల్ నిర్మించాలని నిర్ణయం తీసుకోవడం.. గ్రామస్థులు తమకు పరిహారం ఇవ్వాలని అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్థానిక నాయకుల ద్వారా ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో మళ్లీ అధికారులపై స్థానిక నాయకులు ఒత్తిడి తీసుకువచ్చి తమకు పరిహారం అందించేందుకు నివేదిక పంపించాలని అభ్యర్థించారు. పెన్నపేరూరు గ్రామంలోని ఇళ్లకు పరిహారం అందించేందుకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరోసారి గ్రామాన్ని సందర్శించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారని ఎస్ఈ వెంకటరామిరెడ్డి తెలిపారు. పూర్తిస్థాయి నీటి మట్టం 78 టీఎంసీలు పెడితే ఏ మేరకు వెనుకజలాలు గ్రామానికి వస్తాయనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పరిహారంపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని.. తమ పరిధిలో లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వైవీయూ కళాశాలకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్



విద్యార్థులను అభినందిస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ రెండో దశ అంతర్ కళాశాలల పోటీల్లో వైవీయూ కళాశాల ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పోటీల్లో భాగంగా వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగంలో ఈనెల 3న నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, రైఫిల్ షూటింగ్, బెస్ట్ ఫిజిక్స్ క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించి తన ఘనత చాటింది. పతకాలు సాధించిన క్రీడాకారులను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు ప్రొఫెసరు పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, వ్యాయామ విద్య క్రీడ శాస్త్రాల విభాగాధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి అభినందించారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా బాలికల జట్టు





టీం చాంపియన్‌షిప్ సాధించిన బాలురు , బాలికలు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జికారొనేషన్ క్లబ్ ఇండోర్‌స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు నిరంతరం సాధన చేసి క్రీడానైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ద్వితీయస్థానంలో నిలిచిన కడప జిల్లా బాలికల జట్టును ఆయన అభినందించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. టీం చాంపియన్ షిప్ బాలికల విభాగంలో గుంటూరు ప్రథమస్థానంలో నిలువగా, కడప ద్వితీయస్థానంలో, కృష్ణా జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో చిత్తూరు జట్టు ప్రథమస్థానంలో నిలువగా పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ద్వితీయస్థానంలో, కర్నూలు జిల్లా జట్టు తృతీయస్థానంలో నిలిచింది. విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ను అందజేశారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు త్వరలో మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారద, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జిలానీబాష, అబ్జర్వర్ శ్రీనివాసరావు, అరుణ, విజయప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తున్న ముఖ్యమంత్రి'

కడప స్పోర్ట్స్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల వైపు మొగ్గు చూపేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారని జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (డీఎస్ఏ ఎఫ్ఈఏ) అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశం దక్కేలా స్పోర్ట్స్ కోటాను మూడు శాతానికి పెంచడం హర్షణీయమన్నారు. ఒలంపిక్స్‌లో పతకాలు సాధించిన వారికి రూ. ఏడు కోట్ల ప్రైజ్ మనీని అందించేలా ప్రభుత్వం ప్రకటించడంతో క్రీడాకారుల్లో జోష్ ఏర్పడిందన్నారు. ఉద్యోగాలలో స్పోర్ట్స్ కోటా కింద ఇదివరకున్న 2 శాతాన్ని ప్రస్తుతం 3 శాతానికి పెంచడంతో పాటు నగదు ప్రోత్సాహకాలు పెంచడం వల్ల యువత క్రీడలవైపు మొగ్గు చూపే అవకాశాలున్నాయన్నారు.



అధిక వేగం ప్రాణాలు తీస్తోంది. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలనే శ్రద్ధ అధికారులకు లేదు. వారం రోజుల క్రితం వేంపల్లె పాపాఘ్ని నది నుంచి ఇసుక ట్రాక్టర్ అతి వేగంగా రావడం, వేంపల్లె-గండి రోడ్డుపై వెళ్తున్న బుల్లెట్ వాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా ఆయన తండ్రి తీవ్రంగా గాయపడ్డాడు. నది వైపు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం వల్ల వేగంగా ట్రాక్టర్లు, ఇతర వాహనాలు రావడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. - వేంపల్లె, (ఆంధ్రజ్యోతి)

జాగ్రత్తలు పాటించి తెల్లదోమను తరిమేద్దాం

కమలాపురం రూరల్‌,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తగు జాగ్రత్తలు పాటించి తెల్లదోమను తరిమేద్దాం అని వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కమలాపురం, దేవరాజుపల్లె, గంగవరం గ్రామాల్లో పర్యటించి వేరుశనగ, మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్‌వీ తెగుళ్ల తెల్లదోమ ద్వారా వ్యాపిస్తాయన్నారు. వేరుశనగ పూత దశలో లేదా 40 నుంచి 45 రోజుల పైరుకు ఎకరాకు 200 కేజీల జిప్సం ఐదు సెంటీమీటరు లోతులో పడే విధంగా వేసుకోవాలన్నారు. గింజ నూన శాతం, నాణ్యత బాగా వస్తుందన్నారు.

నాగార్జున యూనివర్సిటీ బీఓఎస్ చైర్మన్‌గా డాక్టర్ మృత్యుంజయరావు



కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైవీ యూ లలితకళల విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు, గుంటూరు నాగార్జున యూనివర్సిటీ లలిత కళావిభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ మృత్యుంజయారావు బీఓఎస్ చైర్మన్‌గా రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారు. లలితకళల వివిధ అంశాలపై సుమారు 50కి పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలను ప్రచురించడంతోపాటు మూడు పుస్తకాలు ముద్రించారు. లలితకళా రంగంలో సిలబస్ రూ పకల్పనలో విశేష అనుభవం కలిగి పలు రాష్ట్ర, జాతీయస్థాయి కార్యశాలలను నిర్వహించారు. ఈయన ఎంపిక పట్ల వైస్ చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి స్వాగతాలు.. వినతులు

పులివెందుల టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితకు పలువురు టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. అనంతపురం జిల్లా నుంచి కడపకు వెళుతూ మార్గమధ్యంలో పులివెందుల చేరుకున్న సవితకు టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి ఘన స్వాగతం పలికారు. అలాగే పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకట్రామిరెడ్డి, విజయకుమార్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

లింగాల: మంత్రి సవిత లింగాల మండలం అంబకపల్లె -ముదిగుబ్బ ఘాట్‌రోడ్డు వద్దకు చేరుకున్న సమయంలో బీటెక్ రవి టీడీపీ నాయకులతో కలిసి ఘనస్వాగతం పలికి కడప జిల్లాలోకి ఆహ్వానించారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

వేంపల్లె, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : వేంపల్లె పాపాఘ్ని నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు వేంపల్లె రైతులు విన్నవించారు. వేంపల్లె ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టీడీపీ నేతలు, మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీడైరెక్టర్ షబ్బీర్, రైతు విభాగ రాష్ట్ర నాయకులు జగన్నాథరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నందిపల్లె రామగంగిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర, యువనాయకులు నామా వేమ తదితరులు ఘనస్వాగతం పలికారు.

హనుమాన్ జంక్షన్‌లో...

వేంపల్లెలోని హనుమాన్ జక్షన్‌లో మంత్రి సవితకు, బీటెక్ రవికి ఘనస్వాగతం పలికారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, వేంపల్లె పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, మాజీ మండల కన్వీనర్ మల్లంగి భాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, జయచంద్రారెడ్డి, ఎద్దుల శేషారెడ్డి,రెడ్డి కిషోర్ తదితరులు ఘనస్వాగతం పలికారు. వేంపల్లె అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రౌడీషీటర్లుగా తొలగించాలని వినతి

చక్రాయపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం కక్షపూరితంగా రౌడీషీటర్లుగా తమపై కేసులు నమోదు చేయించిదని, రౌడీషీటర్ల నుంచి తమ పేర్లు తొలగించాలని చక్రాయపేట మండల సీనియర్ నాయకుడు లోమడ భాస్కర్‌రెడ్డి, బీసీ సంఘం నాయకుడు రమేష్ మంత్రి సవితకు విన్నవించారు. మంగళవారం కడపలో ఎమ్మెల్యే మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి విన్నవించారు.




మంత్రిని సత్కరిస్తున్న టీడీపీ నేత లక్ష్మీరెడ్డి కుటుంబ సభ్యులు.. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి

ఇన్‌చార్జ్ మంత్రిని కలిసిన లక్ష్మీరెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిని మంగళవారం టీడీపీ సీనియర్ నాయకుడు, అలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి ఆయన కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. బిల్డప్ సర్కిల్ పుత్తా ఎస్టేట్‌లో మంత్రిని కలిసి గజమాలతో సత్కరించారు. అనంతరం లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు.

బ్రౌన్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

బ్రౌన్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీ బ్రౌన్ సలహా మండలి సభ్యుడు జానమద్ది విజయభాస్కర్ కోరారు. మంగళవారం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే మాధవి పాల్గొన్నారు.

చేనేతల జీవితాల్లో వెలుగులు నింపాలి

కడప మారుతీనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలని టీడీపీ తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడక చక్రధర్ మంత్రి సవితకు విన్నవించారు. అనంతరం చేనేత వెల్ఫేర్ సొసైటీ పోస్టర్లను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరింపచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సమితి నాయకులు పట్టుపోగుల సుబ్బారావు పాల్గొన్నారు.

వైవీయూను ప్రక్షాళన చేయాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో వైవీయూలో జరిగిన అక్రమ నియామకాలు అవినీతిపై సీఐడీతో విచారణ చేయించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నోటిఫికేషన్, రోస్టరు నిబంధనలు పాటించకుండా 191 మందికి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాలను అక్రమంగా నిర్వహించారన్నారు. దీనిపై విచారణ జరిపించాలని కోరారు. ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్‌సింహ, అమృత్, పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నేత గోవర్ధన్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఇన్‌చార్జ్ మంత్రి సవితను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి కలిశారు. ఇన్‌చార్జ్ మంత్రికి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలి: ఎస్టీఎఫ్

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ 35 శాతం ఐఆర్ ప్రకటించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు.

ఇన్‌చార్జ్ మంత్రిని కలిసిన వికాస్ హరిక్రిష్ణ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):కడప నగరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితమ్మను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సవితను కలిసిన టీడీపీ నేత దుర్గాప్రసాద్

కడప నగరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితను టీడీపీ రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రి సవితను దుశ్శాలువతో సత్కరిస్తున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ



మంత్రిని సత్కరిస్తున్న దుర్గా ఆటోమోటివ్స్ అధినేత దుర్గాప్రసాద్

అన్నదాత అభివృద్ధే టీడీపీ ధ్యేయం

● ప్రతి ఎకరాకు సాగునీరు ● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి



మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం కమలాపురం మండలం చదిపిరాళ్ల చెరువు నిండటంతో అధికారులతో కలిసి దిగువ కాల్వకు నీరు వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరువు జాబితాలో మన జిల్లాను కూడా చేర్చాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కూడా అందించాలని కోరామన్నారు. అనంతరం శివాలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాసులు, మల్లిఖార్జునరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దారు శివరామిరెడ్డి, టీడీపీ నాయకులు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రఘురాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మల్లేశ్, రాయల్ దివాకరరెడ్డి, మస్తానయ్య, రాజారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ హర్షం: క్రిష్ణా జలాలతో చదిపిరాళ్ల చెరువును నింపడం హర్షణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఆ చెరువును సీపీఐ బృందం పరిశీలించారు. ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని అభినందించారు.

వ్యవసాయ శాఖ కడప డివిజన్ ఏడీగా శంకర్‌నాయక్

కడప రూరల్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ శాఖ కడప డివిజన్ ఏడీగా శంకర్‌నాయక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న ఆయన్ను ప్రభుత్వం ఇక్కడ ఏడీగా నియమించింది. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ కడప డివిజన్ పరిధిలో రైతులకు వ్యవసాయ సేవలను మరింతగా మెరుగుపరుస్తామన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ కార్యక్రమాలను సకాలంలో రైతులకు అందించి అధిక దిగుబడుల సాధనకు కృషిచేస్తామన్నారు.అలాగే రైతులు తమకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే తగు సూచనలు సలహాలు అందిస్తామని పేర్కొన్నారు.

మురుగుతో విద్యార్థుల ఇబ్బందులు



యర్రగుడిపల్లెలో మురుగుకాల్వ, పక్కనే భోజనం చేస్తున్న విద్యార్థులు



ఆర్.తుమ్మలపల్లెలో అంగన్వాడీ కేంద్రం వద్ద నిల్వ చేరిన మురుగు

పులివెందుల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మురుగుతో ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లతరబడి పక్కనే మురుగు ఉందని అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసిన ఎటువంటి ఫలితం లేదని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అంటున్నారు. పరిస్థితి ఎలా ఉందో చూడండి అంటూ దగ్గరుండి చూపినా సమస్యకు పరిష్కారం చూపడం లేదని అంటున్నారు. ఒకవైపు దుర్వాసన, మరోవైపు దోమలతో తీవ్ర సమస్యలు పడుతున్నారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లి వాసన వెదజల్లకుండా చర్యలు చేపట్టడం లేదని అంటున్నారు. పట్టణంలోని యర్రగుడిపల్లె జిల్లా పరిషత్ బాలకోన్నత పాఠశాలు, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల ఎదుటే మురుగు కాల్వ ఉంది. మురుగు ముందుకు కదలకపోవడం, అక్కడే నిల్వ ఉండడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని అంటున్నారు. డైనింగ్ హాల్ లేకపోవడంతో మధ్యాహ్న భోజనం కూడా పాఠశాల ఆవరణంలోనే తినాల్సిన పరిస్థితి ఉంది. దీనితో సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోంది. పాఠశాల భవ నం నిర్మించిన కాంట్రాక్టర్ కాంపౌండ్‌వాల్ నిర్మించలేదు, కనీసం కాల్వకు పైకప్పు కూడా ఏర్పాటు చేయలేదని వా పోతున్నారు. ఈ విషయాన్ని అనేక మార్లు విన్నవించిన ఫలితం లేదు. అలాగే పట్టణంలోని బాలికల వసతి గృహం వద్ద మురుగు సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. మురుగునీరు ముందుకు కదలకపోవడంతో ఏళ్ల తరబడి నిల్వ ఉంటోంది. దీనితో రాత్రి పూట దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినిలు అంటున్నారు. అలాగే మండలంలోని ఆర్.తుమ్మలపల్లె గ్రామంలోని అంగన్వాడీ స్కూల్ వద్ద మురుగునీటి చెరువు దర్శనమిస్తుంది.అంగన్వాడీ కేంద్రానికి వెళ్లాలంటే మురుగుకాల్వను దాటి వెళ్లాలి. ఏళ్ల తరబడి మురుగు నీరు నిల్వఉన్నప్పటికి అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు సమస్య లేకుండా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

'జనవరి 5న చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి

వీరపునాయునిపల్లె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ హైందవ శంఖారావడంలో భాగంగా జనవరి 5న జరిగే చలో విజయవాడ బహిరంగ సభను జయప్రదం చేయాలని మండల బీజేపీ కార్యదర్శి తులసి నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం వీరపునాయునిపల్లెలో విలేకరులతో మాట్లాడారు.

విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సీకేదిన్నె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకుని వారి సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో మంగళవారం మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ ఆదేశాల మేరకు బాలల పరిరక్షణ విభాగం కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహ చట్టం, ఫోక్సో చట్టం తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ఎటువంటి సమస్య ఉన్నా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098కు ఫోన్ చేసి తెలిపితే వారి సమస్యలను అధికారులు వెంటనే వచ్చి పరిష్కరిస్తారన్నారు. పిల్లలు తొందర పడకుండా జాగ్రత్తలు తీసుకుని సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. 18 సంవత్సరాల లోపు వయస్సు పిల్లలు బాల్య వివాహక చట్టం, ఫోక్సో చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ వయస్సు పిల్లలు అనేక రకాల సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నేటి సమాజంలో జరుగుతున్న పరిస్థితులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు ప్రత్యూష, లక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డీఏ, పీఆర్‌సీ, అరియర్స్ చెల్లించాలి

కడప మారుతీనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, పెన్షనర్లకు బకాయి ఉన్న రెండు విడతల కరువుభత్యంతో పాటు 12వ పీఆర్సీకి ముందున్న ఇంటీరియమ్ రిలీఫ్ 30 శాతం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీ ఎస్‌జీఆర్‌ఈఏ) జిల్లా అధ్యక్షుడు జంబారపు అహరోన్ కోరారు. మంగళవారం ఆ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ బెనిఫిట్స్ అందకుండానే కొందరు ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వ్యక్తిత్వ వికాసంపై కెరీర్ కౌన్సెలింగ్

కడప నాగరాజుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని రామిరెడ్డి ఫార్మశీ కళాశాలలో మంగళవారం 'వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సెలింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సాయిగ్రేస్ తెలిపారు.భాగంగా జైలుశాఖ నుంచి విచ్చేసిన రిసోర్స్ పర్సన్ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత వ్యక్తిత్వాన్ని ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. అలాగే చెడు స్నేహాలు, రాష్ డ్రైవింగ్, ఆన్‌లైన్ గేమింగ్, సోషల్ మీడియా, లవ్, కమ్యూనిటీ ఇంటరెస్ట్స్, తప్పు ప్రవర్తన తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఉరుసు ఉత్సవాలకు ఇన్‌చార్జ్ మంత్రికి ఆహ్వానం

కడప కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా కడప నగరానికి విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవితకు మంగళవారం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో పెద్ద దర్గా ప్రతినిధులు అమీర్ ఈనెల 16 నుంచి జరగనున్న పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. అందుకు స్పందించిన మంత్రి తప్పక వస్తానని తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

విజయదుర్గాదేవి సన్నిధిలో రాహుకాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న మహిళలు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి

కడప కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం మొదటి మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు రాహుకాల పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించారు. రాహుకాల పూజకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని ఆలయ అర్చకులు తెలిపారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

● ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లా బాలికల జట్టు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జికారోనేషన్ క్లబ్ ఇండోర్‌స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు నిరంతరం సాధన చేసి క్రీడానైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ద్వితీయస్థానంలో నిలిచిన కడప జిల్లా బాలికల జట్టును ఆయన అభినందించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. టీం చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో గుంటూరు ప్రథమ స్థానంలో నిలువగా, కడప ద్వితీయస్థానంలో, కృష్ణా జిల్లా తృతీయ స్థానంలో నిలిచింది. బాలుర విభాగంలో చిత్తూరు జట్టు ప్రథమస్థానంలో నిలువగా పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ద్వితీయస్థానంలో, కర్నూలు జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ను అందజేశారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు త్వరలో మధ్యప్రదేశ్‌లో జరుగనున్న జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారద, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జిలానీబాష, అబ్జర్వర్ శ్రీనివాసరావు, అరుణ, విజయప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టీం చాంపియన్‌షిప్ సాధించిన బాలికలు


టీం చాంపియన్‌షిప్ సాధించిన బాలురు

ఆకట్టుకున్న మహిళల కోలాటం



ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ గీతాశ్రమంలో నామా ఎరుకలయ్య, నామా కమలాక్షమ్మ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళలు ప్రదర్శించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. గీతాశ్రమం ఈవో రామచంద్రాచార్యులు మాట్లాడుతూ మహోత్సవాలు పది రోజులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గీతాశ్రమం సిబ్బంది విజయ్, జనార్ధన్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ముద్దనూరు నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి మంగపట్నం గ్రామానికి చెందిన బోడెద్దుల జగదీశ్వరరెడ్డి(27) కనబడుటలేదని మంగళవారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాంబాబు తెలిపారు.నెల రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి ఇప్పటి వరకు రాలేదన్నారు బాధితుని తండ్రి గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.




పెన్నానదిలో బాలుడు గల్లంతు

● డ్రోన్ కెమెరాలతో పరిశీలన ● కొనసాగుతున్న గాలింపు



కడప క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన మణికంఠ అనే బాలుడు ఆదివారం ఇంటి నుంచి ఈత కోసం స్నేహితులతో కలిసి పెన్నానదికి వెళ్లాడు. నలుగురు తిరిగి రాగా మణికంఠ పెన్నానదిలో గల్లంతైనట్లు తెలిసింది. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న చిన్నచౌకు పోలీసులు సోమవారం పెన్నానదిలో గాలింపు చర్యలు చేపట్టారు. మూడు డ్రోన్ కెమెరాల సాయంతో బాలుడి ఆచూకీ కోసం పరిశీలిస్తున్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుకుపోయి ఉంటాడనే అనుమానంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. చిన్నచౌకు సీఐ తేజమూర్తి, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టినా బాలుడి ఆచూకీ లభించలేదు. దీంతో అటు సిద్దవటం పోలీసుల సహకారంతో బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేదు. రాత్రి కావడంతో బుధవారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టనున్నారు.



రికార్డులు సిద్ధం చేసుకోవాలి

పోరుమామిళ్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఏసీ గ్రేడ్‌పై స్థానికప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ త్వరలో కళాశాలలకు న్యాక్‌పీర్‌టీం విజిట్ ఉందని, కళాశాలలోనే అన్ని విభాగాలు ఐదుసంవత్సరాలకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఎస్ఆర్ కళాశాల ఐక్యు ఏసీ కో-ఆర్డినేటరు వినయ్ , వైస్‌ప్రిన్సిపాల్ ప్రకాశరావు, కోఆర్డినేటరు వెంకటరావు, అధ్యాపకులు సులోచన శ్రీధర్‌మూర్తి పర్వీన్, సబిత తదితరులు పాల్గొన్నారు.

అర్జంటుగా కావలెను

కడప Postal డిపార్ట్‌మెంట్ (Franches) నందు రిజర్వేషన్ కౌంటర్‌లో కంప్యూటర్ నాలెడ్జ్ కలిగిన డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా లేడీస్,జంట్స్ కావలెను. కడప లోకల్ వారికి ప్రాధాన్యత. సెల్: 98850 10546
Ajc-196233

WANTED

ప్రముఖ ఫిజియోథెరపి క్లినిక్‌లో పనిచేయుటకు ఫిజియోథెరపిస్టు కావలెను. సంప్ర : 9701824212, 6304181936
Ajc-000

CHANGE OF NAME

I, Shaik Mahaboob Basha S/o Shaik Jabbar, D.No. 15/702, Zinna Road, Proddatur - 516 360, have changed my name from Shaik Mahaboob Basha (Old Name) to Gali Saheb Gari Shaik Mahaboob Basha (New Name). Hence for the I may called as Gali Saheb Gari Shaik Mahaboob Basha for all Purposes
AJC-224321

పాసుపోర్టు పోయినది

భోగవతి కృష్ణవేణి భర్త భోగవతి రామకృష్ణ, డి.నెం. 2/113, అరవపల్లి, నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్, పాసుపోర్టు నెం. T3236824, 18/05/2024 వ తేది నందలూరు నుండి కడపకు బస్సులో వెళ్తుండగా పోయినది. దొరికినవారు అందజేయగలరు.
Ajc-000

CHANGE OF NAME

I, Shaik Sajedha W/o Shaik Mahaboob Basha, D.No. 15/702, Zinna Road, Proddatur - 516 360, have changed my name from Shaik Sajedha (Old Name) to Gali Saheb Gari Shaik Sajida (New Name). Hence for the I may called as Gali Saheb Gari Shaik Sajida for all Purposes
AJC-224321

CHANGE OF DATE OF BIRTH

I Shaik Mahaboob Chand W/o 16111690M Hav Shaik Ameer Basha, R/o D.No. 5/138, Sinappabavi Street, Porumamilla (M&Po.) YSR Kadapa Dist, Andhra Pradesh, Pin-516193. That my date of birth 01-01-2991 (Rank HAV, 161111690M) is serving in Unit : 20 ENGR REGT and my date of birth in his Army Service Record is wrongly mentioned as 10-02-1992 but my actual date of birth is 01-01-1992, vide affidavit shown before public notary date 02-11-2024
AJC-202180

పాసుపోర్టు పోయినది

కోనేటి లక్ష్మీ శ్రీదేవి భర్త కోనేటి ఈశ్వరయ్య D.No. 3/131, అబ్బనపల్లి గ్రామం, సింగారెడ్డిపల్లి పోస్ట్, పెనగలూరు మండలం, అన్నమయ్యజిల్లా, ఆంధ్రప్రదేశ్ పాసుపోర్టు నెం. B7582925 పెనగలూరు బస్టాండ్ నందు పోయినది. దొరికినవారు అందజేయగలరు.
Ajc-000

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 198462

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మెరుగ్గా గురుకులం విద్యార్థుల ఆరోగ్యం


ప్రొద్దుటూరులో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆది,భూపేశ్

కొండాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో పాముకాటుకు గురై చికిత్స పొందుతున్న వర్షిణి, పల్లవి అనే విద్యార్థినుల ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పల్లవి దాదాపు కోలుకుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వర్షిణిని ఎంఈవో రామయ్య మంగళవారం పరామర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రస్తుతం ఆరోగ్యం మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు తెలిపారని ఎంఈవో తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రొద్దుటూరు హాస్పిటల్‌లోనే ఉంటూ విద్యార్థిని వర్షిణి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్నారు. కాగా గురుకుల పాఠశాలలో తక్షణం మౌలిక వసతులను కల్పించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశించారని.. ఈమేరకు ప్రొక్లెయిన్‌తో పాఠశాలలో మంగళవారం చెత్త చెదారాన్ని తొలగించినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, మండల బీజేపీ నేత శంకర్‌రెడ్డి తదితరులు తెలిపారు. కాగా ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని వర్షిణికి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం రాత్రి జమ్మలమడుగు ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డితో కలిసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శించారు. వర్షిణికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్‌ను కోరారు.



ఘనంగా కొండయ్యస్వామి పుట్టినరోజు వేడుకలు


భక్తుడికి కేకు తినిపిస్తున్న కొండయ్యస్వామి

మైదుకూరు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అవధూత కొండ య్యస్వామి పుట్టిన రోజు వేడుకలను ధరణి తిమ్మాయపల్లెలో మంగ ళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కొండయ్యస్వామికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా కొండయ్యస్వామి చేతుల మీదుగా భారీ కేకు కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. కేకులను తీసుకునేందుకు భక్తులు క్యూలు కట్టారు. వేడుకలకు వచ్చిన భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జబర్దస్త్ ఆర్టిస్టుల కామిడీ ప్రోగ్రామ్ పలువురిని అలరించింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో తిమ్మయపల్లె గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. హరికథ కాలక్షేపానికి భక్తులు భారీగా తరలివచ్చారు.



గంజాయి ముఠా అరెస్టు



చాపాడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుపల్లె గ్రామం చెరువు గట్టుపై మంగళవారం గంజాయి కలిగిన ముఠాను పోలీ సులు అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో గుంటూరుకు చెందిన జొన్నకంటి తిరుమలరావు, ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మేకల సునీల్, సురసుర శ్రీనివాసులు, గుర్రం రమేష్, పాపగాళ్ల సుధీర్‌లు ఉన్నారు. మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య వివరాల మేరకు.. గుంటూరుకు చెందిన తిరుమలరావు అక్కడ నుంచి గంజాయి తీసుకొచ్చి పైనలుగురికి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి 1కేజీ700 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ సుమారు రూ.18 వేలు ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన భూపేశ్‌రెడ్డి



జమ్మలమడుగు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి సావిత్రమ్మకు జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాకతో జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన పలువురు కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జంబాపురం రమణారెడ్డి, దళిత నాయకులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

కాశినాయన మండల నాయకులు...

కాశినాయన, నవంబరు(ఆంధ్రజ్యోతి)5: జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను మంగళవారం కడపలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు మండల టీడీపీ బూత్ కన్వీనర్ హోండా రవీంద్రారెడ్డి,సీనియర్ టీడీపీ నాయకులు కొండా దుగ్గిరెడ్డి, పి.పోలిరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా మండలంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలాయపల్లె క్రిష్ణారెడ్డి, కొండా నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గండికోటను సందర్శించిన ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికోట ప్రాంతాన్ని జమ్మలమడుగు ఆర్డీవో ఆదిమూలపు సాయిశ్రీ సందర్శించారు. మొదట గండికోట సమీపాన ఒబేరాయ్ హోటల్‌కు కేటాయించిన స్థలాలను పరిశీలించారు. అనంతరం లోయ పరిసర ప్రాంతాలు, జుమ్మా మసీదు, తదితర వాటిని పరిశీలించారు. ఈనెల 9వ తేదీ గండికోటకు చంద్రబాబు రానున్నారని ఆదిశగా ఆర్డీవో గండికోటను సందర్శించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. 6వ తేదీ బుధవారం గండికోటకు జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సందర్శిస్తారని సమాచారం. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐలింగప్ప, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి తదితరులుపాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడితే చర్యలు

బద్వేలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మండలంలోని సి. కొత్తపల్లె గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దారు ఉదయ భాస్కర్‌రాజు హెచ్చరించారు. ఈ ప్రాంతంలో సీపీఐ ఆధ్వర్యంలో సర్వేనెంబర్. 51/3లో 1.42 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 500 గుడిసెలు వేశారని, గత నెలలో ఒక్కడ బోరు వేసి ప్రభుత్వ అనుమతి లేకుం డా అక్రమంగా విద్యుత్ కనెక్షన్ బిగించారన్నారు. సదరు కనెక్షన్‌ను మంగళ వారం తహసీల్దారు విద్యు త్ సిబ్బంది ద్వారా తొలగించారు.ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

పెట్టుబడులు తగ్గాలి.. దిగుబడులు పెరగాలి

దువ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పెట్టుబడులు తగ్గించి దిగుబడి పెంచే స్పృహతో మెలకువలు పాటించినప్పుడే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త వీరయ్య అన్నారు. దువ్వూరులో మంగళవారం వ్యవసాయ శాఖ సభాభవనంలో మండలంలోని రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేరుశనగ, మినుము, ఉల్లి, జొన్న సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం విభాగం కో-ఆర్డినేటర్ క్రిష్ణారెడ్డి , ఏవో రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు..: మినుము పంటలో పల్లాకు తెగులు ఆశించిందని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండల పరిధి కొర్రపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఏవో రైతులకు మెలకువలను తెలియజేశారు.పల్లాకు తెగులు నివారణకు తెగులు కన్పించిన మొక్కలను వెంటనే ఏరి వేసి, కాల్చివేయాలన్నారు.రసం పీల్చు పురుగు ఉధృతిని అదుపు చేసేందుకు ముందు జాగ్రత్తగా వేప నూనె 5ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు రాధ, రామసుధ, రైతులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని రామిరెడ్డిపల్లె గ్రామ శివార్లలో మంగళవారం ఏవో చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామిరెడ్డిపల్లె గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు. డాక్టర్ కె.సాయిమహేశ్వరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సేద్య విభాగంవారు జొన్న, శనగ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో శోభారాణి, రైతులు పాల్గొన్నారు.


జమ్మలమడుగు.. రామిరెడ్డిపల్లెలో జొన్నపంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

కలసపాడు..: మండలంలోని గోపవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో ఎస్.జాకీర్ షరీఫ్ రైతులకు మినుము పంట యాజమాన్యంలో సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు వై.కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: రైతులు తమ పొలాల్లో పంట మార్పిడి తప్పనిసరి చేయాలని ఏవో నాగార్జున అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెన్నముక్కపల్లె, అప్పనపల్లె పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సహాయకులు, పశుసంవర్థకశాఖ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి

కాశినాయన నవంబరు(ఆంధ్రజ్యోతి)5: బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని రాజంపేట డివిజన్ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ స్వారో పేర్కొన్నారు. మంగళవారం నర్సాపురంలోని ఏపీజీబీ బ్యాంక్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా బ్యాంక్‌లో ఖాతాదారులకు అందుతున్న సేవలు,బ్యాంక్ పనితీరు, రుణాల రికవరీ తదితర అంశాలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంక్ భవనం ఖాతాదారులకు సౌకర్యవంతంగా లేనందున ఈభవనాన్ని పడగొట్టి కొత్తభవనం నిర్మించాలని నిర్ణయించారు. ఈకార్యక్రమంలో స్థానిక పంచాయతీ సెక్రటరీ రామక్రిష్ణారెడ్డి,బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం


వెలవలి గ్రామంలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

రాజుపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖాధ్వర్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంగళవారం వెలవలి గ్రామంలో సీసీ రోడ్లు ప్రారంభించారు. మొత్తం 15 పంచాయతీలకు గాను రూ.4.20లక్షల పనులకు గాను 23 పనులు సీసీ రోడ్లు, 4 గ్రావెల్ రోడ్లు, ఒక మెటల్ రోడ్లు వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అర్కటవేముల, పర్లపాడు, గాదెగూడూరు తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు మొదలయ్యాయి. ఈ కార్యక్రమంలో వెలవలి టీడీపీ నాయకులు జయవీర ప్రతాప్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పుట్టుకతో వచ్చే లోపాలు నమోదు చేయండి

బి.కోడూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్వాడీ పాఠశాలకు వచ్చే పిల్లలకు పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించి నమోదు చేయాలని వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయ్‌కిరణ్ అన్నారు. మంగళవారం వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు అంగన్వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో నాగలక్ష్మి, సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి, సూపర్‌వైజరు జాన్‌విలియం, హెల్త్ అసిస్టెంటు రామతీర్థ, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్యశిబిరం విజయవంతం

రాజుపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండలదిన్నె, రాజుపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం ప్రొద్దుటూరు వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ పశువైద్య శిబిరాన్ని రాజుపాలెం ఏడీ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ శిబిరంలో చివరి సంవత్సరం వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు. ఈ క్యాంపులో ఎన్ఎస్ఎస్ అధికారులు,జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

అభిమానుల అభిమానం మరువలేనిది

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అభిమానుల అభిమానం మరువలేనిదని 'క' సినిమా హీరో కిరణ్ అబ్బవరం పేర్కొన్నారు. క సినిమా విజయోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం ఆ సినిమా బృందం సుధా థియేటర్‌ను సందర్శించింది. సినిమా ప్రేక్షకులతోపాటు సినిమాను తిలకించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుజిత్, సందీప్, ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వెల్లాల దేవస్థానానికి వేలంలో రూ.5.47లక్షల ఆదాయం

రాజుపాలెం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి దేవస్థానాలలో మంగళవారం కల్యాణమండపం, బియ్యం బేడలు తదితర వాటిని వేలంపాట నిర్వహించారు. ఈ వేలం పాటలో కల్యాణ మండపానికి రూ.3.38 లక్షలు, డెకరేషన్‌కు లక్షరూపాయలు,పెసరబేడలతో కూడిన బియ్యం రూ.99వేలు, బెల్లం 4294, నువ్వులనూనె 2775, ఆముదం 10290, పెసరబేడలు 1740 వచ్చినట్లు తెలిపారు. తలనీలాల వేలం పాట వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి బీవీ నరసయ్య, పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, సిబ్బంది రామ్మోహన్ పాల్గొన్నారు.

పిల్లలను కార్మికులుగా చేర్చుకోవడం చట్టరీత్యా నేరం

కొండాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పిల్లలను కార్మికులగా పనుల్లో చేర్చుకోవడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్, మహిళా పోలీసులు హెచ్చరించారు. మంగళవారం కొండాపురంలోని హోటళ్లు, షాపుల్లో బాలకార్మికులను గుర్తించడానికి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కొండాపురం జడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లేబర్, ఐసీడీఎస్ జిల్లా అధికారులు రవి, మహేష్, ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, చౌటిపల్లె,కొండాపురం మహిళా పోలీసులు వరలక్ష్మి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలి

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొండాపురం గురుకుల పాఠశాలలో పాముకాటుకు గురైన విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థి ప్రజాసంఘాల నాయకులు మంగళవారం డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినులు పల్లవి, వర్షిణి ఆదివారం రాత్రి పాముకాటుకు గురయ్యారు. అయితే పాము కరిచిన విషయాన్ని ఉపాధ్యాయుల దృష్టికి తెచ్చినా వారు ఎలుక కరిచిందని టీవీలు చూస్తూ కాలం గడిపారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం వారి పరిస్థితి విషమిస్తుండడంతో ఆస్పత్రులకు తెచ్చారని తెలిపారు. విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఓబులేసు, జగన్, నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు గడ్డం నరసింహులు, చెన్నమ్మ, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ రితేష్‌కుమార్‌రెడ్డి

బద్వేలుటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సవిత నియమితులైన తరువాత మొదటిసారిగా జిల్లాకు విచ్చేసిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేత బొజ్జ రోశన్న మర్యాదపూరకంగా మంత్రిని కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కూటమి అభ్యర్థులతో సమావేశంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.